వాయిస్ ఆఫ్ ప్రజలు

సోమవారం, జూలై 20, 2026

# శ్రీ అగస్త్య పీఠంలో ఆధ్యాత్మిక శోభ



## శ్రీ గాయత్రీ దేవికి అమ్మవారికి సారె సమర్పణ మహోత్సవం

## ఐదు వేల మంది మహిళలతో మహా కుంకుమార్చన

## డప్పు వాయిద్యాలు, భక్తి నృత్యాలతో కోలాహలం



వీరులపాడు మండలం, నరసింహారావుపాలెం, జూలై 19 (వాయిస్ టుడే): ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం నరసింహారావుపాలెం గ్రామ శివారులోని శ్రీ అగస్త్య పీఠం ఆధ్యాత్మిక వెలుగులతో కళకళలాడింది. శ్రీ సుగుణానంద మహర్షి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ గాయత్రీ దేవికి అమ్మవారి సారె సమర్పణ మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది మంది మహిళలు పట్టుచీరలు, పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు, మంగళ ద్రవ్యాలతో కూడిన సారె ను తీసుకుని డప్పు వాయిద్యాలు, మంగళ వాద్యాలు, భక్తి గీతాలు, ఆటపాటలు, సాంప్రదాయ నృత్యాల మధ్య ఊరేగింపుగా పీఠానికి చేరుకున్నారు. "జై గాయత్రీ మాతా" నినాదాలతో మార్మోగిన ఆ ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పచ్చని కొండలు, పంట పొలాల మధ్య ఉన్న పీఠం అమ్మవారి స్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీ గాయత్రీ దేవికి మహాభిషేకం, ప్రత్యేక అర్చనలు, అలంకరణ, మహా మంగళహారతి, గాయత్రీ మంత్ర పారాయణం, హోమాలు నిర్వహించారు. దేశ శాంతి, లోకక్షేమం, సకాల వర్షాలు, ప్రజల ఆయురారోగ్యాలు, కుటుంబ సౌఖ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

### 2 వేల మంది మహిళలతో వారాహి అమ్మవారికి మహా కుంకుమార్చన

ఈ సందర్భంగా శ్రీ వారాహి అమ్మవారికి టోకెన్ విధానంలో సుమారు 2 వేల మంది మహిళలతో ఉచిత మహా కుంకుమార్చన నిర్వహించారు. భక్తి పారవశ్యంతో మహిళలు కుంకుమార్చన నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. మొత్తం కార్యక్రమంలో సుమారు 5 వేల మంది మహిళా భక్తులు పాల్గొనడం విశేషం.

### అన్నదానం - ప్రసాదాల పంపిణీ

పూజా కార్యక్రమాల అనంతరం వేలాది మంది భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. చలిమిడి, లడ్డూ, పసుపు, కుంకుమ, తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన మహిళా కోఆర్డినేటర్లు, సేవాదళ సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు, అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.





### ప్రముఖుల సందడి

ఈ మహోత్సవంలో ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షులు ఉదయభాను, విజయవాడ కనకదుర్గ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు రమాదేవి, నందిగామ మాజీ ఎమ్మెల్యే జగన్మోహన్ రావు, వీరులపాడు మండలం ఎంపీపీ, ఎంపీడీవో, తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు పటేల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్, సంగాని వెంచర్స్ అధినేత సంగాని రజనీకాంత్ పటేల్, తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్, TMKJF ముఖ్య సలహాదారులు యర్రా యోగేశ్వరరావు, TMKJF రాష్ట్ర కోఆర్డినేటర్ తూడి జనార్ధన్ పటేల్, అరేపుల వెంకట రమణ,రామసాని శ్రీనివాస్ నాయుడు, వంగాల శ్రీనివాస్ రెడ్డి, దంతల భరత్ నాయుడు, సతీష్ దేవులపల్లి, గాలి వినయ్ తదితర ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.





### సుగుణానంద మహర్షి సందేశం

ఈ సందర్భంగా శ్రీ సుగుణానంద మహర్షి మాట్లాడుతూ, "గాయత్రీ దేవి ఆరాధన మానవ జీవితానికి ఆధ్యాత్మిక బలం, కుటుంబ సౌభాగ్యం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తుంది. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. మహిళలు ధర్మానికి మూలస్తంభాలు. ప్రతి కుటుంబం ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి" అని పిలుపునిచ్చారు.

### భక్తి పారవశ్యంలో ముగిసిన మహోత్సవం

భక్తుల "జై గాయత్రీ మాతా"... "జై వారాహి మాతా"... "గురుదేవ్ కి జై" నినాదాలతో శ్రీ అగస్త్య పీఠం పరిసరాలు మార్మోగాయి. వేలాది మంది భక్తుల భాగస్వామ్యంతో జరిగిన ఈ మహోత్సవం ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబిస్తూ విజయవంతంగా ముగిసింది.

**-వాయిస్ టుడే**





